# చరిత్ర కాగడా

ఏదేనా సంస్కారం ప్రచారం కావాలంటే అది విజయవంతం కాకూడదంటారు. నే చెప్పదలచుకున్న కథ యీ సత్యాన్ని ఋజువుచేస్తుందేమో నాకు తెలీదు. అసలు యీ కథకూడా ఎలా చెప్పాలో తెలీడంలేదు. ఈ కథలో వ్యక్తులను నే నెరుగను. నేను విన్నవీ, ఇతరులద్వారా తెల్సు కున్నవీ సేకరిస్తే, వాటికూర్పుకి తుదీ మొదలూ, క్రమం— ఏదీ కనబడదు.

నాకు బాగా చిన్నతనం. మా బాబయ్యతో ఆపెళ్ళికి నేనూ వెళ్ళాను. ఆరోజుల్లో అది అపూర్వమైన వివాహంగా చెప్పుకున్నారు. వధూవరులిద్దరూ చదువుకున్నవారు, భాగ్య వంతులు, రూపసులు, వొకరినొకరు ప్రేమించు కున్నారు— అన్నిటికంటే ముఖ్యమైనది, వేరువేరు శాఖలకు చెందినవారు. సనాతనులు, పూర్వాచారపరాయణులు ఆ వివాహాన్ని ఖండించారు. వధూవరుల తల్లిదండ్రుల సమ్మతం లేదు. పెళ్ళి కాకుంటే ఆత్మత్యాగం చేసుకుంటామన్న నిశ్చయానికి తలొగ్గి, కొందరు సంస్కర్తలు పట్టుబట్టి, మహా వైభవంగా పెద్దల సమక్షాన జరిగిన వివాహం అది. జిల్లాకలెక్టర్,ఆయన భార్య వచ్చి, 'యీ పెళ్ళి ప్రేమ శక్తిని, విజయాన్ని సూచి స్తుం'దని వుపన్యసించి, భార్యాభర్తలను ఆశీర్వదించి వెళ్లారు. పైవూళ్ళనుండి, రాష్ట్రాలనుండి శుభాకాంక్షలు, టెలిగ్రా ములు వొచ్చాయి. వందలాదిగా బహుమతులొచ్చాయి.

వధూవరుల ఫోటోలు ప్రముఖ పత్రికలు ప్రచురించాయి. ఒక పత్రికాసంపాదకుడు 'ఆదర్శవివాహం' అన్న శీర్షికను పెద్ద సంపాదకీయం వ్రాశాడు. ఇవన్నీ ఆనాడు వింతగా చెప్పుకున్నారు. 'ఇవేం పెళ్ళిళ్ళమ్మా—కులగోత్రాలు మంట గలిశాయి' అని చప్పరించి, వేళ్ళు మిటకరించిన అమ్మలక్కలు కార్లో వూరేగుతూన్న దంపతులను తలుపు సందుల్లో నుంచి చూచి, అసూయపడి నిట్టూర్చారట.

ఆమె పేరు సీతాకుమారి, అతని పేరు రామారావు. పేర్లుకూడా చక్కగా అమిరాయి అని ఎవరో వుపన్యసించారు. గ్యాస్‌లైట్లు, కూల్‌డ్రింక్స్, పూలమాలలు, కుంకం, కాగితపు పువ్వులు, సెంట్లు, తమిళగాయకుని సంగీత కచ్చేరీ, రాత్రి పెళ్ళివారికి ప్రత్యేక నాటక ప్రదర్శనం—అదొక అపూర్వ ఘట్టం. సీతాకుమారి, పల్చగా, అతి నాజూకుగా వుంటుంది. గ్యాస్‌లైట్ వెలుగులో ఆమె పచ్చటికాంతి తళుక్కుమంది—నవ్వినప్పుడు, ఆకాశంలో బాణసంచా వేసినట్లు, ముఖమంతా తెల్లటి వెలుగుతో మెరిసి, ఆ దృశ్యం గతంలో వొక మహత్తర అనుభవంగా మధురస్మృతిగా నిలిచిపోతుంది.

రామారావు కూడా చాలా అందమైనవాడు. మన వారిలో పురుషుడి అందం చెప్పుకోరు. 'కుర్రాడు బాగుంటాడు' అని కూడా అనరు. 'అబ్బాయికేం, అబ్బాయి శుభ్రంగా వుంటాడు' అంటే చాలా అందమైనవా డన్న మాట. అట్లాంటివాళ్ళు కూడా రామారావు 'మొగాళ్ళకే చూడ్డానికి బాగుంటాడండి' అనేవారు. సీతాకుమారి ఎంత

గాఢంగా ప్రేమించిందో, ఆనాటి సమాజంలో పెద్దలెవ్వరూ వూహించలేరనొచ్చు

అంతటి గాఢమైన ప్రేమ, అనుకూలదాంపత్యం చూసి దేవతలు ఓర్చలేరంటారు. 'ఈ పెళ్ళి ఆరునెలలు నిలబడితే గొప్ప' అని అంచనావేసిన పెద్దలు, రెండేళ్ళ తర్వాత వారి అన్యోన్యాన్ని చూసి ముక్కుమీద వేలేసుకున్నారు. 'ఐదేళ్లు దాటదండీ' అని మరోమూడేళ్ళు గడువిచ్చారు—ఈ మూడేళ్ళలోనూ ఏదో అవాంతరం సంభవించి ఆ వివాహం భగ్నం కాకపోతుందా అన్న ధైర్యంతో.

ఐదేళ్ళతర్వాత, మళ్ళా వాళ్ళ దాంపత్యం గురించి విన్నాను. ఆమె నొకసారి నాటకంహాల్లో ముందుసీట్లో చూశాను. ప్రేమకి విద్య, భాగ్యం, సౌందర్యం తోడైతే యింకేం కావాలి? జనంఅంతా నాటకం వొదిలేసి వారికేసి చూడడమే సరిపోయింది. ఆమె కట్టిన ఖరీదైన చీర, రవ్వల దుద్దులు, నెక్లెస్, అతని సూటు, వాచ్, అవన్నీ చూస్తే వారిభాగ్యం చాలావరకు వేషధారణకే వినియోగమౌతోందనుకోవాలి. వారిని బాగా ఎరిగున్న స్నేహితు డొకాయన మా బాబయ్యతో చెబుతుంటే విన్నాను. ఆమె ఏదికోరితే అది యిస్తాడుట. చీరలకోసం మైసూరు, కంచి, ఆగ్రా, పూనా వెళ్ళేవారట. హాయిగా చదువుకుంటారట. చీట్లాడుతారట, షికార్లెడతారుట. స్నేహితులు, పిక్నిక్లు, పార్టీలు, యాత్రలు—నిశ్చింతగా సాగిపోతున్న జీవితం వారిది.

సనాతనుల నోళ్ళు నొప్పెట్టి, యీ దంపతుల వూసెత్తడం మానుకున్నారు. ఈలోగా బోలెడన్ని వర్ణాంతర వివా

హాలు, విధవా వివాహాలు, లేచిపోయినవారి వివాహాలు జరిగాయి. వీరంతా పెళ్ళి ఆ కొత్తదంపతులమీద పడ్డారు. ఆచార భారంతో పండిన వారి తలలు బ్రద్దలుకొట్టుకునేందుకు ఏదో గట్టి వాస్తువు దొరకాలిగా మరి!

మరో ఐదేళ్ళు జరిగిపొయ్యాయి. నేను రామారావు, సీతాకుమారి పున్నవూళ్ళో వుండటం తటస్థించింది. ఆమెను చూళ్లేదుకాని, రామారావుని ఒకటి రెండుమార్లు పార్కులో చూశాను వారినిగురించి మా చాకలి 'సందెయ్య' చెబుతుంటాడు. వాళ్ళింట్లో బట్టలుకూడా సందెయ్యేవుతుకుతాడు. వారి జీవిత భోగట్టా వాడు బాగా పరిశీలించి తెలుసుకున్నాడు.

'వారు సుఖంగా, సంతోషంగా వుంటారుకదట్రా?'

'ఏం సుఖంలెండి, ఆమె ఎప్పుడూ విసుక్కుంటమే. ఆయన ఎప్పుడూ చీదరించుకుంటమే'

'ఎందుకు'

'ఏమోనండి. ఆవిడ బట్టలన్నీ పాతబడిపోయినాయి. కొత్తవి కొనరంట—ఎక్కడికీ తీసుకెళ్ళరంట.'

'ఆయనతీసికెళ్ళేదేమిటి? ఆవిడకుబోలెడుడబ్బుందిగా!'

'అదంతా అయిపోయిందండి. అయ్యగారికి భలే జాగ్రత్త; కానీ పోనివ్వరు. ఇంకా ఈసుబేకుని అడగండి' అన్నాడు సందెయ్య.

తరవాత ఈసుబేగ్‌తో మాట్లాడడం తటస్థించింది. అతను వృద్ధుడు. మొదటి ప్రపంచ సంగ్రామంలో పనిచేసి రిటైరై ఏమీ పనిలేకుండా వుంటున్నాడు. దేశవిభజన జరిగిన తర్వాత, ఉత్తర హిందూస్థానం నుండి వొచ్చిన కాందిశీ

కుల గుంపునించి విడిపోయిన 'అయేషా' అనే అనాథకన్యను చేరదీసి పోషిస్తున్నాడు. ఆమె తనని తండ్రిగా చూసుకుని సపర్యలు చేస్తూవుంటుంది. రామారావొకసారి భార్యమీద ఓ పుస్తకం గిరవాటెట్టాడని—అది స్వయంగా చూశానని చెప్పాడు. వారిసంభాషణవల్ల తేలిందేమంటే, వారిడబ్బంతా అయిపోయిందనీ, రామారావు పీనాసిగా తయారై, భార్యని హింసిస్తున్నాడనీ, వారి ఆదర్శవివాహంలో ఏ ఆదర్శమూ లేదనీ విశదమైంది.

ఒక నెల జరిగింతర్వాత, ఈసుబేగ్ చనిపొయ్యాడు. గుండెపగిలి చనిపొయ్యాడంటాడు, చాకలి సోదెయ్య.

'ఎందుకు?'

'రహస్యం లెగండి ఎవరితోనూ అనబోకండి. ఒక రోజు రామారావుగారు అయేషా మొఖంమీద చెయ్యేసి పట్టుగుంటం, ఈసుబేగ్ చూశాడంటండి. నాతో చెప్పాడు. నాగుండె చెదిరిపోయిందరా అన్నాడండి. ఆ దెబ్బతో మంచానపడి సచ్చాడండి.

రామారావుకి సీతాకుమారికీ మానసికంగా కాకుండా శారీరకంగాకూడా యింతటి ఎడబాటు జరిగింది. కారణం? వయస్సుతోపాటు ఆదర్శంయొక్క అంతర్యం మారుతూండడమేమో ననిపిస్తుంది. మానసికంగా ఎడబాటు జరిగింతర్వాత, మనోవ్యాధినుంచి పారిపొయ్యేటందుకు 'అయేషా' కావల్సి వచ్చిందేమో! సీతాకుమారి చాలాకాలం వాళ్ళ వూళ్ళోనే వుంటోంది—ఎప్పుడోకాని భర్త దగ్గర వుండదు. ఈ మధ్యనే మరోవార్త విన్నాను - రామారావు ఆస్తంతా కాందిశీకుల

వసతిభవనాలనిధికి రాసేసి ఉత్తరహిందూస్థానంవెళ్ళి ఆర్మీలో ఉపాధ్యాయుడుగా చేరాడని.

'ఆవిడగారికూడా కొంత యిచ్చి వెళ్ళాడటలెండి — అసలు సున్నాచుట్టకుండా.' అన్నాడు సందెయ్య.

'అయేషా?' అని అడిగాను.

'ఆమె యిక్కడే వుందండి. ఆళ్ళందరికీ కొత్తిస్ప కడుతుండారండి. అక్కడపోయి, ఏదో పన్లో చేరుతుందంటండి.'

'రామారావు ఆమెని తనతో ఎందుకు తీసికెళ్ళలేదు?'

'నేను నిలేసి అడిగానండి ఆ పిల్లని. అదంతా వొట్టిదంటండి. ఊరికే దాని గడ్డంపట్టుకుని, కళ్ళల్లోకి దిగులుగా చూశారంటండి. అంతకి మించి ఏమీచెయ్యలేదని పమాణం చేసి చెప్పిందండి. అదిమట్టుకు అబద్ధం ఆడదండి' అని ముగించాడు సందెయ్య

చరిత్ర చీకటి గుహాలలో కాగడా వేసి చూసినట్లు రామారావు, అయేషా అమాయకపు కళ్ళల్లోకి చూసి, తన హృదయంలో నిండుకున్న ఏకాంతాన్ని, విషాదాన్ని ఆమె చూపులో స్పృశించి. ఆదర్శాల ఐక్యత, మానసిక సమత్వం, సంతృప్తి పొందాడు. అతను పీనాసిగా వుండి పోగుచేసిన సర్వస్వమూ, సత్కార్యానికి, లోక కళ్యాణానికి దానంచేసేశాడు. భార్యవద్దనుండి దాచిన యేకాంత మాధుర్యాన్ని ప్రపంచానికి ఖర్చుపెట్టేశాడు. తను మానసిక స్వాతంత్ర్యం కోరి, భార్యకి ఆ స్వాతంత్ర్యం యిచ్చేశాడు. ఆమెను సోమరిగా వొదిలేసి, తను ఆర్మీలో చేరాడు. అంచేత సంస్కారం ప్రచారంకావాలంటే, అది పూర్తిగాకొనసాగకూడదన్నారు.